జ్వాల తెలుగు న్యూస్

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

శనివారం, 17 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 66


## తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడతాం

# ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం




**ఆదిలాబాద్ జిల్లా :** తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి నిర్మల్‌కే వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే ముఖ్యమంత్రి అయినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మ్నెదటి బహిరంగసభ పెట్టామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అని జల్, జంగల్, జమీన్ అంటూ కుమరంభీం కొట్లాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇచ్చి, పారిశ్రామికంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారుమాజీ సీఎం కేసీఆర్ అనుకుంటే పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ లేదని వెంటనే వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బాసర ఐఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్న సీఎం నిర్మల్‌లో అడ్వాన్స్?డ్? టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కడతాం : తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే, ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామని, ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తామని అన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దామని చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి మోదీని కలుస్తున్నామని, రాష్ట్ర బీజేపీ నేతలు కూడా రాష్ట్రానికి ప్రాజె క్టులు, నిధులు తేవాలని కోరారు.అభివృద్ధి, నిధుల కోసం ఎవరినైనా కలవడానికి తాను సంకోచించనని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని, అడగాల్సిన ప్రాజెక్టులు అడిగామన్నారు. పదేళ్లపాటు కేంద్రప్రభుత్వాన్ని గత ప్రభుత్వం ఏమి అడగలేదని, అలా చేస్తే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలకులు చేసిన అప్పులు ఉరితాడై ప్రభుత్వం ఊపిరి పోతుందని విమర్శించారు. ప్రధాని మోదీని పదే పదే కలుస్తున్నానని కొంతమంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానిని కలిస్తే తప్పేంటి : రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇచ్చేది కేంద్రం, ప్రధాని కాదా అని ప్రశ్నించారు. ప్రధానిని కలవ కపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి అని మండిపడ్డారు. నాగోబా జాతరకు రూ.22 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని, సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్ల కేటాయించి పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందని, పెట్టుబడుల కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు సీఎం తెలిపా రు. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇస్తే సలహాలు ఇవ్వాలి లేకుంటే ఫామ్‌హౌస్‌లో కూర్చోవాలని పరోక్షంగా విమర్శించారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు.

## స్టార్టప్ ఇండియా విప్లవంగా

# మారింది

**- కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన భారతీయ యువతకు లేదు**



**న్యూ ఢిల్లీ :** రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 2014లో దేశంలో 4 యూనికార్న్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్‌ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్ కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు!"స్టార్టప్ ఇండియా మిషన్ వేగాన్ని పుంజుకుంటోంది. అదొక విప్లవంగా మారింది. ఇక కంఫర్ట్ జోన్‌లో జీవించే ఉద్దేశం భారతీయ యువతకు లేనే లేదు. నూతన లక్ష్యాలతో సరికొత్త ఎత్తులకు ఎదగాలని వారు కోరుకుంటున్నారు.

## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

# - సుప్రీం కోర్టులో విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, జనవరి 16:** బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన ప్రక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచు తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ ఎస్ నుంచి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. స్పీకర్ తరఫు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున ప్రక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటి వరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు.గత ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

## ఒక్క వాయిదా పడినా

# వచ్చేస్తున్నారు

**- ఆర్టికల్ 32 దుర్వినియోగమవుతోంది**



**న్యూ ఢిల్లీ :** భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద పిటిషన్లు దాఖలు చేసే హక్కును దుర్విని యోగం చేస్తున్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. బాంబే హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉం డగానే, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై ఆర్టి కల్ 32 కింద నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టులో విచారణ కొనసాగుతున్న సమయంలోనూ ఆర్టికల్ 32 కింద పిటిషన్లు దాఖలు చేయడం సరికాదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తో కూడిన ధర్మా సనం స్పష్టం చేసింది.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా

# స్వర్ణ చంద్రగిరి మండలం



**తిరుపతి, జనవరి 15:** తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నారావారిపల్లెలో ప్రకటించారు. స్వర్ణనారావారిపల్లె తరహాలో స్వర్ణ చంద్రగిరికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్వర్ణకుప్పం, నారావారిపల్లె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణ చంద్రగిరి మండలాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు వీలుగా ప్రణాళికలను అమలు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారిపల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిపల్లె కార్యక్రమానికి ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి.ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ నూటికి నూరు శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా వారి తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగింది.మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ కార్యక్రమాలను కూడా సమర్ధవంతంగా అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చేయటంతో పాటు మౌలిక సదుపాయాల కల్పించారు.ఇప్పుడు ఇదే స్ఫూర్తితో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. ఏడాది లోపు నిర్దేశించుకున్న ఫలితాలు సాధించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం

# కట్టుబడి ఉంది



**ఖమ్మం, జనవరి16 :** రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో మీఫ్రా ద్వారా కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో మీఫ్రా కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల.కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 మీఫ్రా నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.మధ్యవర్తులకు పంటను అమ్మొద్దు..వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, జనవరి16 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించానని వివరించారు కిషన్‌రెడ్డి.లావాదేవీలు పూర్తి చేయాలి.ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని.. అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందనీ కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.అధికారుల పేర్లను పంపించాలి..ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం రాష్ట ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదే విధంగా.. వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలను

# హింసిస్తున్నారు



**బెంగాల్ :** బీజేపీ పాలిత రాష్ట్రాలపై పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు వలస వెళ్లిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఉత్తర బంగాల్?లో మమత ఈ మేరకు వ్యాఖ్యానించారు. శుక్రవారం ఉత్తర బెంగాల్ పర్యటనకు వెళ్లే ముందు ఆమె కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు.మరోవైపు, బంగాల్‌లో అల్లర్లు ప్రేరేపించడానికి బీజేపీ ప్రణాళికలు వేస్తోందని మమత ఆరోపించారు. ఎందుకంటే రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి ఖాయమని వారికి ఇప్పటికే అర్థమైపోయిందన్నారు. అదేవిధంగా బంగాల్?లో కొనసాగుతున్న ఎస్?ఐఆర్? ప్రక్రియపై కూడా మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఎస్?ఐఆర్? వల్ల రాష్ట్రంలో దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఈసీ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, అప్పుడే ప్రజలు వారిని గౌరవిస్తారని మమత పేర్కొన్నారు.

మెదక్ టుడే
శనివారం, 17 జనవరి 2026

# ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన ముత్తాయి కోట సర్పంచ్ శ్వేత కిరణ్ గౌడ్





**హవేలీ ఘన్పూర్ మండలం జనవరి 15 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

సంక్రాంతి పండగ సంబరాలలో భాగంగా ముత్తయి కోట గ్రామం లో సర్పంచ్ గుండారం శ్వేత కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగింది ఇందులో 100 మందికి పైగా పోటీలో పాల్గొనడం జరిగింది ఇందులో మొదటి బహుమతి ఉమ్మెంతలా రోజా రెండవ బహుమతి పొద్చన్ పల్లి నవనీత –శివరాజ్ గౌడ్ మరియు తృతీయ బహుమతి ఎల్లబోయిన విజయం గార్లు గెలుచుకున్నారు నాల్గవ బహుమతి అల్లం దివ్య ఐదవ బహుమతి ఎల్లబోయిన లక్కీ మడబోయిన మౌనిక మరియు కాన్సలేటెడ్ బహుమతులుగా మాడ బోయిన కృతిక పార్తీ గల్ల అమ్ములు రాజ్య మనోజ్ఞ అలేఖ్య కొత్తపల్లి హర్షిత గెలుచుకున్నారు ఈ బహుమతి ప్రధానంలో గ్రామ సర్పంచ్ శ్వేతాకిరణ్‌గౌడ్‌వార్డ్‌మెంబెర్స్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు..

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన కాట సునీత రాజేష్ గౌడ్: సంక్రాంతి శుభాకాంక్షల అందజేత



**సిద్దిపేట, జనవరి : 16(మెదక్ టుడే)న్యూస్ ప్రతినిధి** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు ని ఈరోజు శ్రీమతి కాట సునీత రాజేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హరీష్ రావు నివాసంలో వారిని కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు ఆమెను సాదరంగా ఆహ్వానించి, కుశలప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీష్ రావు తో కలిసి సునీత రాజేష్ గౌడ్ అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) చేశారు. ఈ భేటీలో పలు సామాజిక అంశాలు మరియు నియోజకవర్గ విశేషాలపై అనౌపచారికంగా చర్చించుకున్నట్లు సమాచారం.

# ప్రమాదాల నివారనే లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాల దిశగా ముందుకు పోతుంది

## - అదనపు కలెక్టర్ నగేష్





**మెదక్ కలెక్టరేట్ జనవరి 15 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో,అరైవ్ అలైవ్కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి,ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, రూరల్ సీ.ఐ జార్జ్‌తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ. అధికారులు ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్ణ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నా రు.అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు ఉద్యోగులు పాటిస్తూ మరొకరికి ప్రచారం చేస్తూ స్పూర్తిగా నిలవాలన్నారు మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి వి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ అరైవ్ –అలైవ్కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు.ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 19 వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయం తో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాలలో వాయిదా

**- మిగతా మండలాలలో తాసిల్దార్ కార్యాలయలలో యధావిధిగా ప్రజావాణి**

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**




**మెదక్ జనవరి 16 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

మున్సిపాలిటీ ఎన్నికల సన్నహాకా పనులలో అధికారుల నిమగ్నమైనందువల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపల్ ఏరియాలో వాయిదా వేసినట్టు ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.మున్సిపల్ ఎన్నికల సన్నాహక పనులు ముఖ్యమైన కార్యకలాపాలలో జిల్లా స్థాయి అధికారులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో, ఈ నెల 19 న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాలలో ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. మిగతా మండలాలలో తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 37 ఏళ్ల సేవా ప్రస్థానానికి అభినందనలు





**మెదక్ జనవరి 16మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

శుక్రవారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 1989లో పోలీస్ శాఖలో చేరి 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు నిర్విరామంగా సేవలందిస్తూ, క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవలో ఆదర్శంగా నిలిచిన అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సేవలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కొనియాడారు. పోలీస్ శాఖ అభివృద్ధి, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు .కార్యక్రమంలో భాగంగా సిబ్బంది అదనపు ఎస్పీ మహేందర్ తో కేక్ కట్ చేసి, ఆయన సేవా ప్రయాణానికి గౌరవ సూచకంగా అభినందనలు తెలిపారు.జిల్లా ఎస్పీ నివాస రావు మాట్లాడుతూ, అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 37 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించడం ప్రశంసనీయమని అన్నారు. క్రమశిక్షణ, విధినిబద్ధత, ప్రజాసేవలో ఆయన చూపిన నాయకత్వం పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అలాగే, యువ పోలీస్ అధికారులకు ఆయన సేవా ప్రయాణం ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తన సేవా ప్రయాణ ంలో తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహెూద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖలో పని చేయడం తనకు గర్వకారణమని, ప్రజల సేవే లక్ష్యంగా భవిష్యత్తులోనూ అంకితభావంతో విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# గణితంలో ఆదుర్తి శ్రీవల్లికి పీహెచ్.డీ.



**పటాన్ చెరు జనవరి : 16 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఆదుర్తి శ్రీవల్లి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మైక్రోఫ్లూయిడ్ అప్లికేషన్ల కోసం మైక్రోఛానల్ లో విద్యుదయస్కాంత ప్రవాహం యొక్క గణిత నమూనా, విశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోతాహర్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన మైక్రోఛానళ్లలో సంక్లిష్ట ద్రవాల యొక్క విద్యుదయస్కాంత హైడ్రోడైనమిక్ ప్రవాహాలపై సైద్ధాంతిక అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ల్యాబ్–ఆన్–చిప్ సిస్టమ్ లు, లక్ష్య ఔషధ పంపిణీ వంటి అధునాతన మైక్రోఫ్లూయిడ్ వినియోగానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు.డాక్టర్ శ్రీవల్లి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

**నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్‌తో పాటు లైసెన్స్ రద్దుకు చర్యలు**

**ప్రతి ప్రాణం విలువైనది -- రోడ్డు భద్రతపై అవగాహన**

**జిల్లా పోలీస్ కార్యాలయంలో "నో హెల్మెట్ నో ఇంట్రీ అమలు**

**మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**







**మెదక్ జనవరి 16 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

శుక్రవారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ గారు ఎరైవే అలివేలు రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నో హెల్మెట్ నో ఇంట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలు హెల్మెట్ ధరించకుండా వస్తే కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతి ఉండదని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు ద్విచక్ర వాహనాలపై వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్‌లో వాహనం నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రాణాలకు ప్రమాదకరమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇటువంటి నిబంధనల ఉల్లంఘనపై ఎలాంటి ఊపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి సారి పట్టుబడితే ఫైన్ విధిస్తామని, అదే తప్పిదాన్ని మరోసారి చేస్తే కేసును మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ కు రాసి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాల్లో అనవసరంగా ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని నివారించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, మన జీవితాన్ని రక్షించే ముఖ్యమైన భద్రతని ప్రజలు గుర్తించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడే ఎరైవే అలివేలు లక్ష్యం సాకారం అవుతుందని తెలిపారు.చివరగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనాల చట్టంలో పొందుపరచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించనని, ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని దృఢసంకల్పంగా ప్రమాణం చేస్తున్నాను అని రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ ముర్తి, ఎసై లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## అభిమానుల కోలాహలం మధ్య మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ జన్మదిన వేడుకలు

**- ఈ వేడుకల్లో భాగంగా పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కొల్లూరి భరత్ కి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.**





**రామచంద్రపురం జనవరి: 16 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్ జిహెచ్ఎంసి పరిధిలోని మాజీ కౌన్సిలర్, ప్రముఖ నాయకులు కొల్లూరి భరత్ జన్మదిన వేడుకలు అభిమానులు, అనుచరులు మరియు కార్యకర్తల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని తెల్లాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి అభిమానులు భారీ సంఖ్యలో భరత్ నివాసానికి చేరుకున్నారు. భారీ గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం అభిమానుల కేరింతల మధ్య ఆయన కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా భరత్ గారికి శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, ప్రముఖులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా జనసందోహంగా మారింది. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేయడంతో పాటు స్థానిక వృద్ధాశ్రమాల్లో ఆర్థిక సాయం అందజేశారు. యువత రక్తదాన శిబిరాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కొల్లూరి భరత్ మాట్లాడుతూ.. తన పుట్టినరోజు వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన అభిమానులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, ప్రేమాభిమానాలే తనను ముందుకు నడిపిస్తున్నాయని, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తెల్లాపూర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో " తెల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తెల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ లెలిజాల, మరియు డిసిసి ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్ గౌడ్ పాల్గొని భరత్ ని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భరత్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## 12వ వార్డ్ మెంబర్ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వడీయారం ప్రీమియర్ లీగ్ సీజన్ 3




**చేగుంట జనవరి 15 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం పడియారం గ్రామంలో జరిగిన వడీయారం ప్రీమియర్ లీగ్ సీజన్ 3 నిర్వహించడం జరిగింది మూడు రోజులపాటు జరిగినటువంటి క్రికెట్ టోర్నమెంట్ లో విన్నర్ గా గేమ్ సింగర్స్, రన్నర్ గా కువైట్ లెవెల్ గెలుపొందారు. వారికి ఉపసర్పంచ్ నాగరాజు గ్రామ పాలకవర్గం సభ్య లు బహుమతులు ఇవ్వడం జరిగింది వారు మాట్లాడుతూ ఇందులో మొత్తం ఆరు టీములు పాల్గొన్నారు వివిధ గ్రామాల నుండి కూడా వచ్చి ఇక్కడ ఆడినందుకు మాకు సంతోషకరంగా ఉంది అని అన్నారు. 12వ వార్డు మెంబర్ అయిన అనిల్ కుమార్ యాదవ్ ఇలా క్రికెట్ టోర్నమెంట్ పెట్టడం ఎంతో సంతోషకరమైన విషయ ం యువతను ఇలా ప్రోత్సాహం చేయడం ఎంతో సంతోషకరమైన విషయం వారికి మేము అందరం తోడు ఉంటాం వారికి కూడా యువకులు గ్రామ ప్రజలు అందరూ సహకారం అందించాలని వారు అన్నారు. టోర్నమెంట్ నిర్వహించిన అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇంత పెద్ద టోర్నమెంట్స్ కి సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బం డారి నాగరాజు వార్డ్ మెంబర్ గయాసద్దీన్ అనిల్ కుమార్ యాదవ్, గ్రామ పెద్దలు డాక్టర్ రామ స్వామి రామకృష్ణ గౌడ్, గొల్ల శంకర్,వివిధ టీం మెంబర్స్ గ్రామ యువకులు పాల్గొనడం జరిగినది

## ప్రజా ప్రతినిధులు పెడచెవిన పెట్టినా.

**ఐనవోలు (హనుమకొండ):** ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలను అధికార పార్టీ ఎమ్మెల్యే పట్టించుకోకపోయినా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ నేతృత్వంలో అధికారులు విజయవతంతం చేశారు. కలెక్టర్ అదేశాల మేరకు ఆర్డీవో, డీపీవో, డీఎల్పీవో పర్యవేక్షణలో జాతర నోడల్ ఆఫీసర్ స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఈవో కందుల సుధాకర్, ఎంపీడీవో నర్మద, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో జాతరలో పారిశుధ్య పనులు నిర్వహించారు. రూ.3 లక్షలతో బ్లీచింగ్, సున్నం, 150 అఫ్రన్ కోట్లు, చెత్తకు పెద్ద డబ్బాలు కొనుగోలు చేసి) పనులు చేసి జాతరను క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చేశారు.

## అమీన్‌పూర్ సర్కిల్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్: స్వచ్ఛతపై అవగాహన కల్పించిన డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్






**అమీన్ పూర్ జనవరి: 16 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జి హెచ్ ఎం సి ) అమీన్‌పూర్ సర్కిల్-47 పరిధిలో ఈరోజు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ అమీన్ పూర్, బీరంగూడ, ఆర్.సి. పురం, భారతి నగర్ మరియు బొల్లారం డివిజన్లలోని పలు కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. స్వచ్ఛతతో రంగవల్లులు: గతాభివృద్ధి పాయింట్ల (జీవీపీ) వద్ద చెత్తాచెదారం లేకుండా చూడటమే కాకుండా, అక్కడ ముగ్గులు (రంగోలి) వేయడం మరియు మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛతను ప్రోత్సహించాలని పౌరులకు పిలుపునిచ్చారు. ?చెత్త సేకరణపై అవగాహన: ప్రతి ఇంటి నుండి తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ వ్యాప్తంగా ఎక్కడా పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు మరియు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని, మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు మరియు వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఎస్ఎఫ్-2026 విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**- గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఏర్పాట్ల పరిశీలన**
**- ఈనెల 19 నుంచి 23 వరకు ప్రతిష్టాత్మక దక్షిణాది రాష్ట్రాల సైన్స్ మేళాలి**







**రామచంద్రపురం జనవరి : 16 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ ( ఎస్ ఐ ఎస్ ఎఫ్ )--2026 నిర్వహణ జిల్లా ప్రతిష్టకు నిదర్శనమని, దీనిని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈనెల 19 నుండి 23 వరకు రామచంద్రాపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శన ఏర్పాట్లను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్కూల్ ప్రాంగణంలోని ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, సైనేజ్ బోర్డుల ఏర్పాటు, గ్యాలరీల సంఖ్య మరియు విద్యుత్ సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, భోజన, రవాణా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రదర్శన సాఫీగా సాగేలా నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు బ్యాకప్ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు అని కలెక్టర్ చెప్పారు. వసతి, భోజనం, రవాణా, పారిశుధ్యం, వైద్యం మరియు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు తమ విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలి. ప్రతి కమిటీ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిన్నపాటి సమస్యలనైనా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీవో రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓలు నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్, పటాన్‌చెరు తహశీల్దార్ మరియు వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## మురిసిన వంగర పులకించిన భక్తజనం

**- వంగరలో భక్తిప్రపత్తుల 'రథ' చక్రం**
**-శతాబ్ది వేడుకగా వీరభద్ర యాత్ర**
**- పీవీ ప్రభాకర్ రావు నేతృత్వంలో వైభవంగా ఉత్సావంగా**



**మెదక్ జనవరి 16 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

ఆధ్యాత్మికతకు అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే వంగర వీరభద్ర స్వామి రథయాత్ర బుధవారం జనసంద్రాన్ని తలపించింది. భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు పూర్వీకుల కాలం నుండి వస్తున్న ఈ సంప్రదాయం, భక్తికి వారసత్వానికి వారధిగా నిలిచింది. పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, పీవీ శరత్ బాబు, పీవీ మదన్ మోహన్,తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావుతదితర కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ యాత్ర అత్యంత వైభవంగా సాగింది. ఈ రథయాత్ర కేవలం ఒక వేడుక కాదు, మా కుటుంబానికి దైవానికి ఉన్న అనుబంధం. మా నాయనమ్మ రత్నమ్మ పురుష సంతానం కోసం వీరభద్ర స్వామికి మొక్కుకుని, నాన్నని (పీవీ నరసింహారావు) దత్తత తీసుకోవడం వల్లే ఈ వంశం నేడు ఇలా ఉందనేది మా ప్రగాఢ విశ్వాసం. ఆ కృతజ్ఞతతోనే 1925 ప్రాంతంలో ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని నాన్న తన చివరి శ్వాస వరకు గౌరవించారు. ఆయన దేశ ప్రధానిగా ఉన్నా సరే, వంగర రథయాత్ర విశేషాలను అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు ఆ పవిత్ర బాధ్యతను మోసే అవకాశం మాకు దక్కడం పూర్వజన్మ సుకృతం అని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2,000 మంది భక్తులు పాల్గొన్నారు. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో స్థానిక ప్రముఖులు మొండయ్య, వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వందేళ్ల నాటి ఈ చరిత్రను నేటి తరం యువతకు పరిచయం చేస్తూ, వంగర గ్రామ ఐక్యతను చాటిచెప్పడమే ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## మార్గదర్శకాలు పాటిద్దాం క్షేమంగా ఇళ్లకు చేరుదాం: డీఎస్పీ ప్రభాకర్

**- గుమ్మడిదలలో ' అరైవ్ అలైవ్ ' రోడ్డు భద్రత అవగాహన సదస్సు**
**- ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ మరియు పోలీసు అధికారులు**






**గుమ్మడిదల జనవరి:16(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. అరైవ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం గుమ్మడిదల ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. గతంలో జరిగిన ప్రమాదాలను ఉదాహరణగా చూపిస్తూ, అజాగ్రత్త వల్ల జరిగే నష్టాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు నిర్ణీత వేగాన్ని పాటించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చ రించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, అలా చేసేవారికి కఠినమైన శిక్షలతో పాటు భారీ పెనాల్టీలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం సీఐ రమణారెడ్డి , గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం , ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ హెచ్ ఓ, పిహెచ్సి డాక్టర్, మండల స్థాయి వివిధ శాఖల సిబ్బంది మరియు నాయకులు పాల్గొన్నారు.

# జమ్మూ సరిహద్దులో డ్రోన్ల కలకలం భారత్ సైన్యం అలర్ట్



**న్యూ ఢిల్లీ:** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది పాకిస్థాన్. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు.పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎూజ) దాటి భారత భూభాగంలోకి అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# నోట్ల కట్టల కేసులో పిటిషన్ సుప్రీంకోర్టులో జస్టిస్ యశ్వంత్ వర్మకు చుక్కెదురు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఉన్న అవినీతి ఆరోపణలపై పార్లమెంటరీ ప్యానెల్ చేపడుతున్న దర్యాప్తు చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. అలాగే లోక్‌సభ స్పీకర్ ఆయనను తొలగించాలంటూ వచ్చిన అభిశంసన తీర్మానాన్ని స్వీకరించడం సరైనదేనని స్పష్టం చేసింది.జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. జనవరి 8న వాదనలు ముగించిన ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచగా, శుక్రవారం ఉదయం ప్రకటించింది. జస్టిస్ వర్మ వాదనలను తోసిపుచ్చుతూ, పార్లమెంటరీ ప్రక్రియలో లోక్‌సభ స్పీకర్ తీసుకున్న చర్యల్లో ఎలాంటి అక్రమం లేదని కోర్టు తేల్చి చెప్పింది.కేసు నేపథ్యం ఇలా!గత ఏడాది మార్చి 14వ తేదీన న్యూఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఘటన తర్వాత అక్కడ భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పట్లో దిల్లీ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమనేని!ఈ ఘటనపై అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణకు ఆదేశించారు. పంజాబ్- హరియాణా



హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సందవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 4వ తేదీన తన నివేదికను సమర్పిస్తూ జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమని, ఆయన ప్రవర్తన న్యాయవృత్తికి విరుద్ధమని తేల్చింది.

విచారణ కమిటీ ఏర్పాటుఅయితే ఆ నివేదిక తర్వాత కూడా జస్టిస్ వర్మ రాజీనామా చేయలేదు. దీంతో అప్పటి సీజేఐ నివేదికను, జస్టిస్ వర్మ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, ప్రధానమంత్రి వద్దకు పంపించారు. దాంతో ఆయనపై అభిశంసన ప్రక్రియకు బాట పడింది. అనంతరం ఆగస్టు 12వ తేదీన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, జస్టిస్ యశ్వంత్? వర్మను తొలగించాలంటూ వచ్చిన తీర్మానాన్ని స్వీకరించారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యలతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.సుప్రీంకోర్టుకు యశ్వంత్ వర్మఅయితే మొత్తం ప్రక్రియను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జడ్జెస్ (ఇంక్వైరీ) చట్టం--1968 ప్రకారం స్పీకర్‌కు ఆ విధంగా కమిటీ ఏర్పాటు చేసే అధికారం లేదని, రాజ్యసభలో ఇలాంటి తీర్మానం తిరస్కరణకు గురైన నేపథ్యంలో లోక్‌సభ చర్యలు చెల్లవని ఆయన వాదించారు. అలాగే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌కు తీర్మానాన్ని తిరస్కరించే అధికారం లేదని పేర్కొన్నారు. విచారణ కమిటీ చట్టబద్ధంగానే ఉందన్న న్యాయస్థానంఅయితే సుప్రీంకోర్టు జస్టిస్ వర్మ వాదనలను అంగీకరించలేదు. అధ్యక్షుడు లేని సమయంలో ఉపాధ్యక్షుడు బాధ్యతలు నిర్వర్తించగలిగినట్టే, ఛైర్మన్ లేనప్పుడు డిప్యూటీ ఛైర్మన్ కూడా అధికారాలు వినియోగించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే స్పీకర్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఉందని తేల్చింది. ఈ తీర్పుతో జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటరీ ప్యానెల్ దర్యాప్తు కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

# ఒడిశా భీమ మండలి గుహలు- 15 వేల ఏళ్లనాటి ఆదిమానవుల ఆనవాళ్లు

**ఒడిశా :** సంబల్‌పుర్ జిల్లా రైరాఖోల్ అటవీ కొండల్లో ఉన్న భీమ మండలి గుహలు, భారత ప్రాచీన చరిత్రను కొత్త కోణంలో చూపించే ఆధారాలను వెలికి తీస్తున్నాయి. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న తవ్వకాల్లో సుమారు 15 వేల సంవత్సరాల నాటి మానవ నివాసానికి సంబంధించిన ఆనవాళ్లు ఉండొచ్చని పురావస్తు అధికారులు భావిస్తున్నారు.గుహల గోడలపై శిలాచిత్రాలు, రాతి పనిముట్లుభీమ మండలి గుహల గోడలపై ఉన్న రాతి శిల్పాలు, ప్రాచీన



చిత్రాలు, అలాగే తవ్వకాల్లో లభించిన రాతి పనిముట్లు భారత పురావస్తు సర్వే అధికారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రాంతంలో లభించిన మట్టి పాత్రల అవశేషాలు, రాతి సూదులు ప్రస్తుతం కార్బన్ డేటింగ్ పరీక్షల కోసం పంపించారు. వీటి నిర్ధారణతో భీమ మండలి ప్రాధాన్యం మరింత స్పష్టమవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.భీమ మండలి కొండ గుహల్లో లభించిన ఆధారాలు రాతియుగ నాగరికతకు చెందినవిగా కనిపిస్తున్నాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. అందులో వేటకు ఉపయోగించిన పదునైన రాతి ఆయుధాలు, అలాగే గుహల గోడలపై ఉన్న చిత్రాలు, ఈ ప్రాంతంలో మానవు ఉనికిని తెలియజేస్తున్నాయని చెబుతున్నారు.మహాభారత కాలంతో ముడిపడ్డ నమ్మకాలురైరాఖోల్ ఉన్న ఈ గుహలు చాలాకాలంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలవిగా, మహాభారత కాలానికి చెందినవిగా స్థానికులు విశ్వసిస్తున్నారు. దీంతో శాస్త్రీయంగా పరిశోధన చేయాలని డిమాండ్? పెరుగుతోంది. అంతకుముందు, గంగాధర్ మెహర్ యూనివర్సిటీ, ఇంటాక్ పరిశోధకులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. తాజాగా పూరి సర్కిల్‌కు చెందిన ఏఎస్ఐ ప్రత్యేక బృందం తవ్వకాలు ప్రారంభించింది. అందులో రాతి బ్లేడ్లు, కత్తులు, సూది ఆకారపు పనిముట్లు, ఈటెలు, బాణాలు లభించాయి. అయితే ఈ పరికరాలన్నీ ఇనుము, రాగి, కాంస్యం వంటి లోహాల వినియోగం తెలియని కాలానికి చెందినవిగా ఏఎస్ఐ అధికారి తెలిపారు. ఈ పనిముట్లు పూర్తిగా రాతియుగానికి చెందినవేనని ఆయన అన్నారు.

# గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడి గెలుపు

**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జాల్నా కార్పొరేషన్‌లోని 13వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీకాంత్ పాంగార్కర్ విజయం సాధించారు. 2017లో ముంబైలో సంచలనం సృష్టించిన జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో శ్రీకాంత్ పాంగార్కర్ నిందితుడిగా ఉన్నారు. తాజా ఎన్నికల్లో ఆయన బీజేపీ, ఇతర పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులపై 2,621 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ వార్డు నుంచి షిండే సారథ్యంలోని శివసేన తమ అభ్యర్థిని నిలబెట్టలేదు.పాంగార్కర్ 2001 నుంచి 2006 వవరకూ అవిభక్త శివసేన నుంచి కార్పొరేటర్‌గా సేవలందించారు. 2011లో టికెట్ నిరాకరించడంతో ఆయన హిందూ జనజాగృతి సంస్థలో చేరారు. 2018లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నాటు బాంబులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్న క్రమంలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఆయనను అరెస్టు చేసింది. పేలుడు పదార్థాల చట్టం,



చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఈ అరెస్టు జరిగింది. అయితే 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనలో పాంగార్కర్ చేరారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని షిండే నిలిపివేశారు.జర్నలిస్టు, హక్కుల కార్యకర్త గౌరీ లంకేశ్‌ను 2017 సెప్టెంబర్ 5న ఆమె నివాసంలో దుండగులు కాల్చిచంపారు. ఈ హత్య సంచలనం సృష్టించింది. భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని, దేశంలో రాజకీయ అసహనం పెరిగిపోయిందంటూ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ కేసులో నిందితుడిగా అరెస్టయిన పాంగార్కర్‌కు 2024 సెప్టెంబర్ 4న కర్ణాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది.

# అండర్‌వరల్డ్ మాజీ డాన్ కుమార్తెలు ఓటమి

**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ పోల్స్‌లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ముంబైలో ఒకప్పుడు పేరుగాంచిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే అరుణ్ గావ్లీ కుమార్తెలైన గీత గావ్లీ, యోగిత గావ్లీ ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తమ తండ్రి గావ్లి స్థాపించిన అఖిల్ భారతీయ సేన తరఫున ముంబైలోని బైకుల్లా ఏరియా నుంచి ఈ ఇద్దరూ పోటీ చేశారు. బృహాన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా గీత పనిచేశారు. ఈ



ఎన్నికల్లో ఆమె 212వ వార్డు నుంచి పోటీ చేసి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి అమ్రిన్ షెహజాద్ అబ్రహాని చేతిలో ఓటమి పాలయ్యారు. 207వ వార్డు నుంచి యోగిత తొలిసారి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రోహిదాస్ లోఖాండే చేతిలో ఓటమి చవిచూశారు.ముంబైలో 2007 మార్చి 2న శివసేన కార్పొరేటర్ కమలాకర్ జామ్‌సండేకర్ తన నివాసంలో హత్యకు గురైన కేసులో అరుణ్ గావ్లీకి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ కేసులో సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో 2025 సెప్టెంబర్అబశ్రీశ్రీలో నాగపూర్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. 1980, 1990 దశకంలో దావూద్ ఇబ్రహీం గ్యాంగ్ డి-కంపెనీకి సమాంతరంగా ఆయన క్రైమ్ సిండికేట్ నడిపారు. 70 ఏళ్ల గావ్లి 2004 నుంచి 2009 వరకూ ముంబైలోని చించ్‌పోకలీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు.

# ఇజ్రాయెల్‌లో ఉద్రిక్తతల వేళ భారతీయులకు హెచ్చరిక

**పశ్చిమాసియా :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ కీలక సూచనలు జారీ చేసింది. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా అత్యవసరం కాని ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని సూచించింది. అలాగే ఇజ్రాయెల్ ప్రభుత్వం, హోమ్ ఫ్రంట్ కమాండ్ జారీ చేసిన భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని భారతీయులను కోరింది.అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలిఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసిన రాయబార కార్యాలయం, "ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక అధికారులు, హోమ్ ఫ్రంట్ కమాండ్ ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలి. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఇజ్రాయెల్‌కు అత్యవసరం కాని ప్రయాణాలు పెట్టుకోవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో భారత రాయబార కార్యాలయం 24 గంటల హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పేర్కొంది.ఇరాన్‌లో భద్రత క్షీణించింది: భారత్ మరోవైపు, ఇరాన్‌లో పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారినట్లు సమాచారం. నిరసనకారులు- భద్రతా బలగాల మధ్య ఘర్షణలు




జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అల్లర్లలో వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో భద్రతా పరిస్థితి తీవ్రంగా క్షీణించిందని భారత్ భావిస్తోంది. ఇరా న్‌పై అమెరికా సైనిక చర్యలు చేపట్టే అవకా శముందన్న వార్తలు కూడా ఉద్రిక్తతను మరింత పెంచు తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్ భద్రతాపరమైన చర్యలు కఠినతరం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇజ్రాయె ల్‌లోని భారతీయుల భద్రతపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే టెల్ అవీవ్ రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలిఇప్పటికే ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టమైన సూచనలు ఇచ్చింది. తదుపరి నోటీసు ఇచ్చే వరకు ఇరాన్‌కు వెళ్లవద్దని భారత పౌరులను హెచ్చరించింది. అలాగే ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న భారతీయులు అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాల ద్వారా వెంటనే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు అందరూ ఈ సూచనలను పాటించాలని కోరింది.పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులు ఎప్పుడూ దగ్గరే!ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక వార్తలను గమనిస్తూ రాయబార కార్యాలయంతో ఎప్పటిక ప్పుడు సంప్రదింపులో ఉండాలని సూచించింది. ప్రయాణ పత్రాలు, పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులు ఎప్పుడూ దగ్గర ఉంచు కోవాలని తెలిపింది. ఇంకా రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోని భారతీయులు వెంటనే నమోదు చేసుకోవాలని కోరింది.

# మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. 52 మంది మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. గురువారం ఉదయం బీజాపూర్ జిల్లా ఉన్నతాధికారులతోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఎదుట వీరంతా లొంగిపోయారు. వీరిలో 21 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు.లొంగిపోయిన వారిలో దండకారణ్యం స్పెషల్ జోన్, ఏవోబీలో విధులు నిర్వహిస్తున్న మావోయిస్టులతోపాటు బహ్మరాఘడ్ ఏరియా కమిటీలోని సభ్యులు సైతం ఉన్నారు. వీరిపై రూ.1.41 కోట్ల రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు ఈ సందర్భంగా తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన భరోసా కల్పించడంతో వీరంతా లొంగిపోయారని బీజాపూర్ జిల్లా ఎస్పీ జీతేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు.లొంగిపోయిన వారిలో.. డివిజన్ కమిటీ సభ్యుడు లక్కు కరం అలియాస్ అనిత్ (32), ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు లక్ష్మీ మాద్వి (28), చిన్ని సోది అలియాస్ శాంతి (28).. వీరు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ప్రకటించామని చెప్పారు. మరో 13 మందికి.. ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, 19 మందికి రూ. 2 లక్షలు, మరో 14 మందికి రూ. లక్ష చొప్పున రివార్డుగా ప్రకటించామన్నారు. లొంగిపోయిన 52 మంది మావోయిస్టుల్లో 49 మందికి మొత్తం రూ. 1.41 కోట్లు ప్రకటించామని వివరించారు. అయితే ఈ లొంగిపోయిన మావోయిస్టులు అందరికి తొలుత రూ. 50 వేలు చొప్పున అందజేస్తామని జిల్లా ఎస్పీ యాదవ్ వెల్లడించారు.

# పాక్‌ను అడ్డుకోవాల్సిందే 'విభజన అజెండా' కోసం ఐరాసను దుర్వినియోగం చేస్తోంది: భారత్

**పాకిస్థాన్ :** విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. ఐరాస ఛార్టర్ ప్రకారం లభించిన స్వీయ నిర్ణయ హక్కును పాక్ దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామిక దేశాల్లో విభజనవాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్‌ను నిరోధించాలని కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సెలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. 2025లో ఐరాస కార్యక లాపాలపై సెక్రెటరీ జనరల్ విడుదల చేసిన వార్షిక నివేదికపై అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న ఐరాస జనరల్ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మ్యాథ్యూ పున్నూస్ ప్రసంగిం చారు.కశ్మీర్ గురించి మాట్లాడే హక్కు పాక్‌కు లేదుప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోందని మ్యాథ్యూ పున్నూస్ మండిపడ్డారు. భారత్‌లో ఒక భాగమైన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీరు గురించి మాట్లాడేందుకు ఐరాసను పాక్ వేదికగా చేసుకోవడం సరికాదన్నారు. మరో దేశానికి చెందిన భూభాగం గురించి మాట్లాడే హక్కు ముమ్మాటికీ పాక్‌కు లేదన్నారు. 1948 ఏప్రిల్ 21న ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానం ప్రకారం జమ్మూకశ్మీరు నుంచి సేనలను పాక్ వెనక్కి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాటి నుంచి జమ్మూకశ్మీరు ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికలలో



ఓట్లు వేస్తూ, తమ ప్రతినిధులను చట్టసభలకు పంపుతున్నారని మ్యాథ్యూ పున్నూస్ తెలిపారు. ఈవిధంగా తాము భారతద్దేశ పక్షమే అనే సందేశాన్ని జమ్మూకశ్మీరు ప్రజలు ఇచ్చారని స్పష్టం చేశారు. పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ ఈ ఐరాస సెషన్‌లో జమ్మూకశ్మీరు అంశాన్ని లేవనెత్తడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.పాక్‌కు అలవాటుగా మారిపోయింది "విభజనవాద అజెండాను అన్ని వేదికల్లో ప్రమోట్ చేయడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిపోయింది. ఆ అలవాటునే ఇప్పుడు పాక్ కొనసాగిస్తోంది. మేం పాక్ వాదనకు కౌంటర్ ఇవ్వక తప్పదు. ఒకవేళ పాక్ నిరాధార ఆరోపణలు, అవాస్తవాలను మేం ఎప్పటికప్పుడు తిప్పి కొట్టకుంటే, అది వాస్తవ విరుద్ధ అంశాలను ఇలాగే చెబుతుంటుంది. మేం ఐరాసకు చెందిన అన్ని వేదికల్లో వాస్తవాలను తెలియజేస్తున్నాం. పాక్‌ను నిలువరించాల్సిన అవసరం ఉంది" అని మ్యాథ్యూ పున్నూస్ పేర్కొన్నారు.ప్రపంచ శాంతిపై ఐరాస గళం విప్పాలి"గ్లోబల్ సౌత్ దేశాల సెంటిమెంట్‌ను ఐరాస గౌరవించాలి. ఆ దిశగా నిర్దిష్ట చర్యలను చేపట్టాలి. దశాబ్దాల కిందటి సమీకరణాల ప్రకారం ప్రస్తుతం ఐరాసలో ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి. తాజా సమీకరణాల ప్రకారం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు దక్కాలి. ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ పక్ష సంస్థ ఐరాస ప్రస్తుత సందర్భానికి అనుగుణంగా మారాలి. ప్రస్తుతం చాలా సంక్లిష్టమైన దశను ఐరాస చవిచూస్తోంది. క్లిష్టమైన సవాళ్లను అది ఎదుర్కొంటోంది. శాంతి, భద్రత, వికాసం - మానవ హక్కులపై ఐరాస గళం విప్పాలని ప్రపంచ పౌరులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. అంతర్జాతీయ సమాజానికి సంబంధించిన కీలకమైన విధులను నిర్వర్తించలేని స్థితికి ఐరాస చేరడం అనేది దాని ప్రభావశీలత, ధర్మబద్ధత, విశ్వసనీయతలను ప్రశ్నార్థకంగా మార్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంక్షోభాలు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో, ఆయా చోట్ల మనుషుల బాధలను తొలగించేలా ఐరాస మాట్లాడుతుందని ప్రపంచం ఆశిస్తోంది" అని మ్యాథ్యూ పున్నూస్ వ్యాఖ్యానించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..